సాక్షి కామారెడ్డి

శనివారం ı 29 ı జూలై ı 2023



కరెంటు కష్టాలు తీరాయి

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత విద్యుత్ కష్టాలు తీరాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 8లో ▸



ఉద్యోగ భద్రత కల్పించాలి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను కోరారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

27.2 /21.5

వాతావరణం

ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ప్రజలే నా బలగం'



భిక్కనూరు: నియోజకవర్గ ప్రజలే తన బలగమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం భిక్కనూరులో ని ర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త తీవ్రంగా కృషిచేయాలని సూచించారు. తాను ఎప్పటికీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. అధికారంలో లేనప్పటికి ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, వారికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటున్నానని పేర్కొన్నారు. వానలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సీ ఎం కేసీఆర్ ప్రగతిభవన్, ఫామ్‌హౌస్ వదిలి బయటకు రావడం లేదని విమర్శించారు. అధికారంలోకి వస్తే అమలు చేసే కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యా ల సుదర్శన్, సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, గజ్జె సురేశ్, సిద్ధగౌడ్, నీల అంజయ్య, దుర్గయ్య, ద్యాగల కిరణ్, చేపూరి రాజు, కొట్లని స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్' అడ్మిషన్స్ పోస్టర్ల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: జిల్లాలోని ఓపెన్ స్కూల్స్‌లో ఎస్సెస్సీ, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి నీల లింగం, ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కన్వీనర్ రవీందర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపిక్ సేవలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపిక్ వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఈ విధానం ద్వారా పిత్తాశయం, కిడ్నీలో రాళ్లు, అపెండిక్స్ తదితర ఆపరేషన్‌లు ఉచితంగా చేయనున్నారు.

'ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి'



భిక్కనూరు: ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా వైద్యసిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ సూచించారు. శుక్రవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ వైద్యురాలు యేమిమా, ఫార్మసిస్ట్ వెంకటేశం, ఏఎన్‌ఎంలు శ్యామల, విజయ తదితరులు ఉన్నారు.

అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు



సాగుకు భరోసా

ఖరీఫ్ సీజన్‌లో సరైన వానలు లేక నెలన్నర కాలం కరిగిపోయి పంటల సాగు విషయంలో ఆందోళన చెందిన రైతులపై వరుణుడు కరుణను వర్షించాడు. పదిరోజులుగా జిల్లావ్యాప్తంగా వానలు దంచికొడుతుండడంతో జలవనరులన్నీ నిండుకుండలుగా మారాయి. భూగర్భజలాలు పైకి వచ్చి, బోర్లు ఎత్తిపోస్తున్నాయి. దీంతో రెండు పంటలకు భరోసా దొరికినట్లేనని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నిండుకుండల్లా జలాశయాలు
- అలుగులు పారుతున్న చెరువులు
- ఉబికివచ్చిన భూగర్భజలాలు.. బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు
- రెండు పంటలకు ఢోకా లేదంటున్న రైతన్నలు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో వానాకాలం సీజన్‌లో శుక్రవారం వరకు సాధారణ వర్షపాతం 368.1 మి.మీ. కాగా ఇప్పటికే 605.6 మి.మీ. వర్షం కురిసింది. సాధారణంకన్నా 64.5 శాతం ఎక్కువగా వానలు పడ్డాయి. అన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో వానాకాలంలో 5.10 లక్షలపైచిలుకు ఎకరాల్లో, యాసంగిలో 4.14 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. కాగా వానాకాలంతో పాటు యాసంగిలోనూ పంటల సాగు విస్తీర్ణంలో సగ భాగం వరి పంటే ఉంటోంది. వానాకాలంలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో, యాసంగిలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. వర్షాకాలం సీజన్ మొదలైన తర్వాత పక్షం రోజుల వరకు తొలకరి పలకరించలేదు. జూన్ చివరలో కొన్నిచోట్ల జల్లులు కురిశాయి. అయితే విత్తనం వేసేందుకు అనుకూల పరిస్థితులు కనిపించలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈనెలలో కురిసిన వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పది రోజులుగా దంచికొడుతున్న వానలతో అంతటా జలకళ సంతరించుకుంది. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. భూగర్భజలాలు పైకి రావడంతో బావులు, బోర్లలో ఊటలు పెరిగి ఎత్తిపోస్తున్నాయి. జిల్లాలో 1,16,331 వ్యవసాయ బోర్లు, బావులు ఉన్నాయి. భారీ వర్షాలు కురియడంతో వర్షాకాలంతో పాటు యాసంగిలోనూ భూగర్భజలాలకు ఢోకా ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

'గెటె'త్తిన ప్రాజెక్టులు..

జిల్లాలోని ప్రధాన జలవనరులైన నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్‌నాలా, పోచారం, కల్యాణి ప్రాజెక్టులు నిండుకుండలుగా మారాయి. జిల్లాలో 1,425 చెరువులు, కుంటలు ఉండగా.. దాదాపు అన్నింటా నీరు పుష్కలంగా చేరింది. వెయ్యికిపైగా చెరువులు అలుగులు పారాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువకావడంతో గురువారం సాయంత్రమే నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో పది రోజులుగా అలుగు పారుతోంది. కౌలాస్‌నాలా ప్రాజెక్టు ఐదు గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. కల్యాణి ప్రాజెక్టు పదిరోజులుగా పొంగుతోంది. సింగితం రిజర్వాయర్ ద్వారా నిజాంసాగర్ ప్రధాన కాలువకు భారీగా నీరు ప్రవహిస్తోంది.

పుష్కలంగా నీరు..

జిల్లాలోని ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటలన్నీ నిండుకుండలుగా మారడంతో సాగునీటి కష్టాలు తీరినట్టేనని రైతులు భావిస్తున్నారు. పక్షం రోజుల క్రితం వరకు పోచారం ప్రాజెక్టు నీటిమట్టం డెడ్‌స్టోరేజీలో ఉండగా.. నిజాంసాగర్ ప్రాజెక్టులో 3.5 టీఎంసీల నీరే ఉంది. రెండు ప్రాజెక్టులకు భారీ ఇన్‌ఫ్లో రావడంతో పూర్తిస్థాయిలో నిండడమే కాకుండా గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లాలోని ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటల కిందా సాగునీటికి ఢోకాలేదని భావిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కామారెడ్డి జిల్లాలో బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల రైతులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. మిగతా ఆయకట్టు నిజామాబాద్ జిల్లాలో ఉంది. పోచారం ప్రాజెక్టు కింద ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల పరిధిలో పదివేల ఎకరాల ఆయకట్టు, కౌలాస్‌నాలా కింద జుక్కల్, బిచ్కుంద మండలాల పరిధిలో తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కల్యాణి, సింగితం రిజర్వాయర్ల కింద కూడా పంటలు సాగవుతాయి. జిల్లాలో చెరువులు, కుంటల కింద అరవై వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టులు నిండడంతో రెండు పంటలకూ ఢోకా ఉండదన్న నమ్మకం ఏర్పడింది.


మత్తడి దూకిన పెద్ద చెరువు



చెరువు వద్ద సందర్శకుల సందడి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పెద్ద చెరువు మత్తడి దూకింది. ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అలుగుపైనుంచి నీరు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చెరువు అందాలను వీక్షించడానికి పట్టణవాసులు భారీగా తరలివస్తున్నారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పోలీసులు చెరువు వద్దకు అనుమతించడం లేదు.

'పోచారం'లోకి తగ్గిన వరద



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి శుక్రవారం వరద ఉధృతి తగ్గింది. గురువారం రాత్రి వరకు ప్రాజెక్టులోకి 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం సాయంత్రానికి 7,497 క్యూసెక్కులకు పడిపోయింది. 20 క్యూసెక్కుల నీటిని ప్రధానకాలువ ద్వారా దిగువకు విడుదల చేస్తుండగా.. మరో 7,477 క్యూసెక్కుల నీరు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తూ మంజీరను చేరుతోంది.

కల్యాణి నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

ఎల్లారెడ్డిరూరల్: కల్యాణి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి శుక్రవారం 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో నాలుగు గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు.



నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో



వరద గేట్ల నుంచి విడుదలవుతున్న జలాలు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. శుక్రవారం ప్రాజెక్టులోకి 45 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 2, 3, 4, 6, 7, 10 నంబర్ల వరద గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు వదులుతున్నామన్నారు. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1404.66 అడుగుల(17.311 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

ప్రాజెక్టుపై ఆంక్షలు..

నిజాంసాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో చూడడానికి పర్యాటకులు తరలివస్తున్నారు. అయితే భారీ వరద వస్తుండడంతో పోలీసులు ప్రాజెక్టు కట్టపైకి పర్యాటకులను అనుమతించలేదు. దీంతో ప్రాజెక్టును చూడడానికి వచ్చిన వారు అసహనానికి గురయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు కట్టపైకి పర్యాటకులను అనుమతించడం లేదని ఎస్సై నాగగోని రాజు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టుపై పోలీసు భద్రత

వైభవంగా లక్ష పుష్పార్చన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష పూలు, 11,118 పసుపు కొమ్ములతో అమ్మను అర్చించారు. పూజాదుల్లో ఆర్యవైశ్యం సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ గుప్తా, ప్రధాన కార్యదర్శి భూమేశ్ గుప్తా, కోశాధికారి రాజేందర్, ప్రతినిధులు కూర శ్రీనివాస్, యాద అంజయ్య, గరిపల్లి శ్రీధర్, పాత నవీన్, శ్రీనివాస్, సుదర్శన్, విఠల్, వాసవాంబ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఆలయంలో పసుపు కొమ్ములు సమర్పించి పూజలు చేస్తున్న భక్తులు..



లక్ష పుష్పాలతో అలంకృతురాలైన వాసవి మాత

కండ్ల కలకలం



మాచారెడ్డి కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

- జిల్లాలో వేగంగా వ్యాప్తి
- ఆస్పత్రులకు పెరిగిన రోగుల తాకిడి

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో కండ్ల కలకతో వందలాది మంది ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఎక్కువ మందికి సమస్య తలెత్తింది. నాలుగైదు రోజుల క్రితం ఈ వ్యాధి వ్యాప్తి ప్రారంభమైంది. స్కూళ్లలో కండ్ల కలక ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెంది వారి ద్వారా కుటుంబ సభ్యులకూ విస్తరిస్తోంది. కామారెడ్డి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కండ్ల కలకతో చాలా మంది బాధపడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలోనూ ఈ సమస్య ఉంది. కండ్ల కలకతో బాధపడుతున్నవారు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి సులువుగా వ్యాప్తి చెందే అవకాశం ఉండడంతో ఇంటిల్లిపాది ఇబ్బందిపడుతున్నారు. పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజీ వద్ద ఉన్న మాచారెడ్డి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 16 మంది విద్యార్థినులలో ఈ సమస్యను గుర్తించి, వైద్యం అందించారు. బీబీపేటలోని కేజీబీవీలోనూ పలువురు విద్యార్థులు కండ్ల కలకతో బాధపడుతున్నట్లు తెలిసింది. కండ్ల కలక సమస్య తలెత్తిన వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కండ్లకలక వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా కేజీబీవీలు, గురుకుల పాఠశాలల్లో కండ్ల కలక ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశాలు మెండుగా ఉండడంతో ఆయా పాఠశాలల్లో ముందస్తుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

16 మంది విద్యార్థులకు అస్వస్థత

మాచారెడ్డి: ఆరేపల్లి స్టేజీ వద్ద ఉన్న మాచారెడ్డి కేజీబీవీలో 16 మంది విద్యార్థినులు కండ్ల కలకతో అస్వస్థతకు గురయ్యారని విద్యాలయం ప్రత్యేకాధికారి మైసకల తెలిపారు. దీనిపై వైద్య సిబ్బందికి సమాచారం అందించామని, వారు వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారని పేర్కొన్నారు. కండ్ల కలక ఇతరులకు సోకకుండా ఉండేందుకు బాధితులను ఇళ్లకు పంపించామని వివరించారు.

బీబీపేటకు జూనియర్ కళాశాల మంజూరు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సాక్షి, కామారెడ్డి: బీబీపేటకు జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ శుక్రవారం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. బీబీపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభోత్సవం రోజున జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని తాను మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలకు విన్నవించానని గుర్తుచేశారు. కళాశాల మంజూరు చేసినందుకు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరూ అడగకముందే తాను కళాశాల కోసం ప్రతిపాదించి, మంత్రితో హామీ ఇప్పించానని పేర్కొన్నారు. కాలేజీ వల్ల బీబీపేట ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

నెరవేరిన హామీ

2021 నవంబర్ 9న బీబీపేట మండల కేంద్రంలో ఆధునిక హంగులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. బీబీపేటకు జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కోరగా.. మంత్రులు హామీ ఇచ్చారు. బీబీపేటలో పాఠశాల నిర్మాణానికి శ్రీమంతుడు సినిమా స్ఫూర్తి అని కేటీఆర్ ట్వీట్ చేయడంతో సినీ హీరో మహేశ్‌బాబు కూడా స్పందించారు. తప్పకుండా తన శ్రీమంతుడు సినిమా బృందంతో బీబీపేటకు వస్తానని రీట్వీట్ చేశారు. ఇది జరిగి ఏడాదిన్నర దాటింది. ఎట్టకేలకు కళాశాల ఏర్పాటు హామీ నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కళాశాల కోసం 'సాక్షి' అక్షర సమరం..

బీబీపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటు విషయమై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. 'శ్రీమంతుడు ఎప్పుడొస్తడో', 'కళాశాల కోసం పోరుబాట', 'హామీకి ఏడాదిన్నర.. ఊసేలేని కళాశాల' శీర్షికలతో ప్రచురితమైన కథనాలు చర్చనీయాంశాలయ్యాయి. కళాశాల సాధన కమిటీ చేపట్టిన ఆందోళనలకు 'సాక్షి' మద్దతుగా నిలిచింది. ఎట్టకేలకు కళాశాల మంజూరు కావడంతో కళాశాల సాధన కమిటీ ప్రతినిధులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పంట చేలల్లోని నీటిని తొలగించాలి

భిక్కనూరు: మొక్కజొన్న, పత్తి చేలల్లో అధికంగా ఉన్న నీటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని భిక్కనూరు మండల వ్యవసాయాధికారి రాధ సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంతో పాటు, గుర్జకుంట, భాగిర్తిపల్లి గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు.

వాన బాధితులకు ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం



పిట్లం(జుక్కల్): హాస్నపూర్‌లో నీరుడి పుండరీకం ఇల్లు వర్షాలకు పాక్షికంగా దెబ్బతిన్నది. శుక్రవారం ఇంటిని పరిశీలించిన ఎంపీడీవో వెంకటేశ్వర్‌లు వారికి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..ప్రజలు పాడుబడిన ఇళ్లలోఉండొద్దని, అలాంటి వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే వారికి వేరే చోట ఆశ్రయం కల్పిస్తామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో వరుస చోరీలకు పాల్పడిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 23న గాంధీనగర్‌లోని వాల్మీకీబోయ, ఆంజనేయస్వామి ఆలయాల్లో చోరీ జరిగింది. దొంగలు హుండీలను చోరీ చేశారు. అంతేకాకుండా గాంధీగంజ్‌లోని వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో దొంగతనానికి యత్నించారు. ఈనెల 7న రైల్వేగేట్ సమీపంలోని మూమెంట్స్ హోటల్లో చోరీ జరిగింది. ఆయా కేసుల పరిశోధన నిమిత్తం పట్టణ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ కొనసాగించారు. వేలిముద్రల ఆధారంగా నిందితుడిని గాంధీ నగర్‌లో నివాసం ఉండే బెల్లపు రాజుగా గుర్తించారు. అతని స్వగ్రామం మాచారెడ్డి మండలం అక్కాపూర్ అని పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు. నిందితుడు పాత నేరస్తుడు. జిల్లా కేంద్రంలో అతడిని శుక్రవారం పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. అతడిని కోర్టులో హాజరు పర్చినట్లు వెల్లడించారు.

ఆటో చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: ఆటో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలు.. మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (27) ఆటోలు దొంగతనాలు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ. 9 లక్షల విలువ చేసే ఆరు ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడాది క్రితం జైలు నుంచి వచ్చిన రాజు ఆటోలను చోరీ చేసి అమ్ముతూ జులాయిగా తిరుగుతున్నట్లు చెప్పారు. గత డిసెంబర్‌లో జీజీహెచ్ నుంచి ఆటోను దొంగలించారని, దీనితోపాటు మరో 5 ఆటోలు, నాలుగవ టౌన్ పరిధిలోని ఒక ఆటోను దొంగిలించినట్లు వివరించారు.

మూడు కేజ్‌వీల్ ట్రాక్టర్ల సీజ్

బాల్కొండ: మెండోరా మండలంలో కేజీవీల్స్‌తో తారు రోడ్డుపై వెళ్తున్న మూడు ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కేజీవీల్స్‌తో పట్టీలు లేకుండా రోడ్డుపై వెళ్లడంతో ధ్వంసం అయిందన్నారు.

కరెంట్ కష్టాలు తీరాయ్

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- మద్నూర్ మండలం పెద్ద ఎక్లార, జుక్కల్ మండలం వజ్రకండిలలో సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపన



వజ్రకండిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

మద్నూర్/నిజాంసాగర్(జుక్కల్): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో కరెంట్ కష్టాలు తీరాయని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లార, జుక్కల్ మండలంలోని వజ్రకండిలలో శుక్రవారం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధే మాట్లాడుతూ.. పెద్ద ఎక్లారలో రూ.3 కోట్ల టీఎస్‌డీ నిధులతో, వజ్రకండిలో రూ.2.8 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నాణ్యమైన కరెంట్ అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. 60 ఏళ్లు పాలించిన పార్టీలు రైతులను ఏనాడూ పట్టించుకోలేదని, అప్పట్లో కరెంట్ తీగల మీద బట్టలు ఆరేసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ వ్యవసాయరంగానికి 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ సరఫరా చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలకు కళ్లు బైర్లు కమ్మి విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేశ్‌బాబు, డీఈ కామేశ్వర్‌రావ్, కన్‌స్ట్రక్షన్ డీఈ వెంకటరామయ్య, ఏడీ రామక్రిష్ణ, ఏఈ అరవింద్, పెద్ద ఎక్లార సర్పంచ్ హారిక పటేల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేశ్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, నేతలు నీలుపటేల్ ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు

మద్నూర్(జుక్కల్): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెద్ద ఎక్లారలో ఎమ్మెల్యే హన్మంత్‌సింధేకు శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గోండ ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం అందించారు. తమ సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండల కార్మిక సంఘం అధ్యక్షుడు తులసీరాం, కార్యదర్శి మారుతి, పంచాయతీ కారోబార్లు, పారిశుధ్య కార్మికులున్నారు.

లెక్కల్లోనే మొక్కలు!

పాత రాజంపేట శివారులో రెండో విడత హరితహారంలో ప్రభుత్వ సలహాదారు స్మితా సబర్వాల్ వచ్చినప్పుడు 40 వేల మొక్కలు నాటారు. ఇప్పుడు ఆ స్థలం ఇలా ఖాళీగా కనిపిస్తోంది.



- పల్లెల్లో కానరాని పచ్చదనం
- హరితహారంలో 50 శాతమైనా దక్కని మొక్కలు

కామారెడ్డిరూరల్: ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏటా జిల్లావ్యాప్తంగా లక్షల మొక్కలు నాటుతున్నారు. కానీ ఆ మొక్కలు లెక్కల్లోనే కనిపిస్తున్నాయి. నాటిన మొక్కల్లో సగం కూడా బతకడం లేదు. హరితహారం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 9 కోట్ల 16 లక్షల మొక్కలు నాటినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ అందులో 30 నుంచి 50 శాతం వరకు మొక్కలు బతికి ఉన్న దాఖలాలు లేవు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం హరితహారం మొక్కలు నాటిన గ్రామాల్లో కనీసం 85 శాతం బతికి ఉండాలనే నిబంధన ఉంది. అప్పుడే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామనే నిబంధన ఉంది. అయితే కార్యదర్శుల నిర్లక్ష్యం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కలు చనిపోతున్నాయి. నాటిన మొక్కల్లో సగం కూడా దక్కలేదని సామాజిక తనిఖీల్లో బయట పడ్డ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారులు టార్గెట్ విధిస్తుండటంతో ఆయా శాఖల అధికారులు హడావుడిగా మొక్కలు నాటి మమ అనిపిస్తున్నారు. నాటిన మొక్కల సంరక్షణ గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేరుకే మొక్కలు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శులు రికార్డులను చూపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. హరితహారం పటిష్టంగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఎస్టీల మధ్య చిచ్చు పెడుతున్న సోయం'



మాట్లాడుతున్న బంజార సేవా సంఘం నేతలు

బాన్సువాడ: స్వార్థం కోసం ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఎస్టీల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆలిండియా బంజారా సేవా సంఘం బాన్సువాడ మండల అధ్యక్షుడు రాము రాథోడ్ అన్నారు. శుక్రవారం ఆయన బాన్సువాడలో మాట్లాడారు. రాజకీయంగా మనుగడ కోల్పోతున్న ప్రతిసారి బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, పత్రికల్లోకి ఎక్కుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. బాపూరావుపై బీజేపీ చర్యలు తీసుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బంజారా సేవా సంఘం నాయకులు రూప్‌సింగ్, రామారావు, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు.

స్వీపర్ల డిమాండ్లు నెరవేర్చాలి

- నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం



ఆందోళన చేపడుతున్న స్వీపర్లు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద స్వీపర్లు చేపట్టిన రిలే దీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ్వంది సత్యం వారికి మద్దతు పలికి మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.బాలయ్య, అశోక్, మునీరోద్దీన్, శంకర్, విఠల్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ గేటు వద్ద గల సెమీ మెకానికల్ మెథడ్(ఎస్‌ఎంఎం) ప్లాంటేషన్‌లో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌వో వాసుదేవ్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది ప్లాంటేషన్ ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, ఇతర వ్యర్థాలను ఏరివేశారు. దీంతోపాటు టైగర్స్ ఇంటర్నేషనల్ డేను పురస్కరించుకొని శనివారం నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. డీఎఫ్‌ఆర్‌వో రవికుమార్ ఉన్నారు.

నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయించాలి



జలాల్‌పూర్‌లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో నీరునిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్‌బాల్స్ వేయించాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. జలాల్‌పూర్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. మురికి కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. సర్పంచ్ కృష్ణ, కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో బ్రహ్మం

పిట్లం(జుక్కల్): చిల్లర్గి గ్రామ పంచాయతీని శుక్రవారం ఎంపీవో బ్రహ్మం సందర్శించి పంచాయతీకి సంబంధించిన రికార్డులు, పల్లె ప్రకృతివనం, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. పంచాయతీ పరధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. రిజిస్టర్‌లను అప్‌డేట్‌గా నిర్వహించాలని అన్నారు. ఆశ వర్కర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు దరిచేరకుండా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



ఎర్రాపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కుర్మ సంఘం నాయకులు, మహిళలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేస్తామని పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. ఎర్రాపహాడ్‌లో శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో 100 మంది కుర్మ సంఘం నాయకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు స్వామిరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు సుగుణాకర్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, చందు, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మెకు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి మద్దతు తెలిపారు. వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు యాదవరెడ్డి, గంగాధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



టీఎన్‌జీవో నేతలకు వినతి పత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

కామారెడ్డి అర్బన్: పదిహేడేళ్లుగా ఉపాధి హామీ పథకంలో భాగంగా డీఆర్‌డీవో, గ్రామీణ నీటిపారుదలశాఖ (మిషన్ భగీరథ)లో ఒప్పంద, పొరుగు సేవల కింద ఉద్యోగం చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఎన్‌ఆర్‌ఈజీఎస్, మిషన్‌భగీరథలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది వాపోయారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా నాయకులు టిఎన్‌జిఓల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నరాల వెంకట్‌రెడ్డి, బి.సాయిలుకు వినతి పత్రం అందజేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో తాము పాల్గొన్నా తమను క్రమబద్ధీకరణ చేయడం లేదన్నారు. ఉద్యోగులందరికి టీఎన్‌జీవోల సంఘం అండగా ఉంటుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు కల్పన, కృష్ణాగౌడ్, ధర్మారెడ్డి, హరికృష్ణ, జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ సి బ్బంది శుక్రవారం వినతిపత్రం అందించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు, ఉద్యోగుల ఖాతాల్లో నేరుగా వేతనాలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

పీటీసీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ: ఆకాశవాణి పార్ట్‌టైమ్ కరస్పాండెంట్ల(పీటీసీ)ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీటీసీల పోస్టులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కూడా ఖాళీలు ఉన్నాయని చెప్పారు. 24 నుంచి 45 ఏళ్ల వయస్సుగల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు newsonair. gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తుకు స్వయం ధృవీకరణ సర్టిఫికెట్, ఫొటోలు జతపరిచి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆకాశవాణి, సైఫాబాద్, హైదరాబాద్ 500004 చిరునామాకు ఈ నెల 31లోగా పంపాలని సూచించారు.

క్రైం కార్నర్

మూడు ఇళ్లలో చోరీ

వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నాగయ్య, ప్రమోద్ జోషి, బీడీ కార్ఖానాలో చోరీ జరిగినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. సుమారు రూ.75 వేల విలువగల నగదు, బంగారం పోయినట్లు ఆయన చెప్పారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మోపాల్: మండలంలోని మంచిప్పలో జల్లపురం మౌనిక (25) ఉరేసుకుని శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గాంధారి మండలం చద్మల్‌కు చెందిన మౌనికకు, మంచిప్పలోని సాయికుమార్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రస్తుతం 13 నెలల బాబు ఉన్నాడు. సాయికుమార్ జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరగగా, నచ్చజెప్పారు. కుటుంబ కలహాలతో మౌనిక శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా తమ కుమార్తెను హత్య చేశారని మౌనిక తరపున బంధువులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సురేశ్

భిక్కనూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని కామారెడ్డి డీఎస్పీ సురేశ్ అన్నారు. మండలంలోని గుర్జకుంటలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలను విధించారు. పెండింగ్ చాలన్‌లు ఉన్నా వాహనాదారులనుంచి జరిమానాలను వసూలు చేశారు. డీఎస్పీ సురేశ్ మాట్లాడుతూ పేకాడినా, బెల్టుషాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. సర్పంచ్ మనోరమ రమేశ్‌రెడ్డి, సీఐ తిరపయ్య, ఎస్సైలు ఆనంద్‌గౌడ్, హైమద్, గాంధీగౌడ్, రాజు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి పలువురి మృతి



సాయిలు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన బక్కని సాయిలు(35) గురువారం చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతు అయ్యాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం చెరువుగట్టుపై చూడగా చెప్పులు, బట్టలు కనిపించాయి. చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. చేపల వల కాళ్లకు చుట్టుకోవడంతో మృతి చెందినట్లు మృతుని భార్య మౌనిక ఫిర్యాదు చేశారు. మృతుడికి కూతురు మనుస్మిత, కుమారుడు గంగాప్రసాద్ ఉన్నారు. టీసీసీసీ సభ్యుడు కాసుల బాలరాజు, బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మల్కాపూర్ శివారులో ఒకరు



సాయారెడ్డి మృతదేహం తీసుకువస్తున్న దృశ్యం

నవీపేట: నవీపేట పోలీస్ స్టే షన్ పరిధిలోని మల్కాపూర్ శివారులోని చెరువులో శుక్రవారం చేపలు పట్టేందుకు వె ళ్లిన ఒకరు మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజామాబాద్ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన సిర్నాపల్లి సాయారెడ్డి(52) చెరువు అలుగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడని పేర్కొన్నారు. ఈత రాకపోవడంతో మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు కేసు నమోదు చేశామన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నిజాంసాగర్: నల్లవాగు మత్తడి వరద నీటిలో గల్లంతైన జంగం కృష్ణ (48) మృత దేహం శుక్రవారం లభ్యమైందని ఎస్సై నాగగోని రాజు తెలిపారు. పిట్లంకు చెందిన జంగం కృష్ణ చేపల వేట కోసం నల్లవాగు మత్తడి దిగువన వాగు ఒడ్డుకు వచ్చాడు. వరద ఉధృతి పెరగడంతో కృష్ణ నీటిలో కొట్టుకుపోయాడు. కృష్ణ కోసం గాలింపు చేపట్టగా గల్లంతైన ప్రదేశం నుంచి కిలోమీటర్ దూరంలో చెట్టు కొమ్మకు తట్టుకొని మృతదేహం లభ్యమైంది.

తీర్థయాత్రలకు వెళ్లి మృత్యు ఒడికి..

- తమిళనాడు రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్‌వాసి మృతి



అవినాష్‌గౌడ్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: తమిళనాడు రాష్ట్రంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన అవినాష్‌గౌడ్(23) మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని జర్నలిస్టుకాలనీలో ఉండే రమేష్‌గౌడ్ ఆయన కుమారుడు అవినాష్‌గౌడ్, హైదరాబాద్‌కు చెందిన సిని కళాకారుడు జుట్టు వెంకట్, వేల్పూర్ మండలం పోచంపల్లికి చెందిన గంగాధర్‌గౌడ్, ఆర్మూర్‌కు చెందిన బద్రి, చిట్టాపూర్‌కు చెందిన నర్సింలు ఐదు రోజుల క్రితం కారులో తీర్థయాత్రలకు బయలుదేరారు. యాత్రలో భాగంగా తమిళనాడులోని కంచి ఆలయానికి వెళ్లే మార్గంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం రోడ్డుపై ఆగి ఉన్న బస్సును ఢీకొంది. ఈ ఘటనలో అవినాష్‌గౌడ్, జుట్టు వెంకట్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. రమేష్‌గౌడ్, బద్రి, గంగాధర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల క్షతగాత్రులను కంచి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు

తాడ్వాయి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగ రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వాహనాల తనిఖీలో గాంధారి మండలం బీర్మల్ తండాకు చెందిన గోతిమోహన్‌రాజు మద్యం తాగి బైక్ నడుపుతు దొరికాడన్నారు. కేసు నమోదు చేసి మోహన్‌రాజును శుక్రవారం కామారెడ్డి కోర్టులో హాజరు పరచగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ అతనికి నాలుగు రోజుల జైలు శిక్ష, రూ.400 జరిమానా విధించారని తెలిపారు.

బస్సును ఢీకొన్న కంటైనర్



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తుండగా మండలంలోని బస్వాపూర్ శివారులో వెనుక నుంచి కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయలయ్యాయి. బోధన్ పట్టణానికి చెందిన ధనలక్ష్మి అనే వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ధనలక్ష్మిని హైదరాబాద్ తరలించినట్లు ఎస్సై వివరించారు. బస్సు డ్రైవర్ చలపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.